క్లుప్తంగా

రాజశ్యామల దేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాజశ్యామల దేవి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్షయ తృతీయ, రాజశ్యామల అమ్మవారి జయంతి సందర్భంగా గణపతి శ్రీలక్ష్మీ నారాయణ మూల మంత్ర సహిత అంగ ఉపాంగ ప్రత్యంగ దేవతా సహిత శ్రీ రాజశ్యామల మూల మంత్ర పూజలు, రాజశ్యామల సహస్రనామ హోమం తదితర పూజలను విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేఎంసీ ఎస్‌ఓకు పదోన్నతి


రమణమూర్తి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్‌ఓ)గా పని చేస్తున్న ఎన్ఎస్‌వీ రమణమూర్తికి పదోన్నతి లభించింది. ఆయనకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి వైజాగ్‌లోని ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చారు. జీఎంసీలో 2014 నుంచి 2022 వరకు ఆయన తన సేవలను అందించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలోనూ ప్రత్యేక అధికారిగా కీలక పాత్ర పోషించారు.

ఏపీసీసీ కార్యాలయంపై దాడి తగదు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంపై బీజేపీ గూండాలు దాడి చేయడం తగదని మాజీ ఎమ్మెల్సీ, డీసీసీ మాజీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి జరిగిందంటే రాష్ట్ర ప్రభుత్వానికి అవమానకరమన్నారు. గతంలో టీడీపీ ఆఫీస్‌పై దాడి చేస్తే చంద్రబాబు ఏ విధమైన చర్యలు తీసుకున్నారో, ఎవరెవరిపై కేసులు పెట్టారో అదే రీతిలో ఏపీసీసీ కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పర్యవసానం మరో విధంగా ఉంటుందని హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను గృహనిర్బంధం చేయడమేంటని ప్రశ్నించారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బజారన్న, బీసీ సెల్ చైర్మన్ డీవీ సాంబశివుడు, జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ ఖాజా హుసేన్, నాయకులు ఖాద్రి బాషా, రియాజుద్దీన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్


వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే దస్తగిరి


పింఛన్ అందిస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామంలో గురువారం ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. లబ్ధిదారులకు ప్రతినెలా పెన్షన్ సక్రమంగా అందుతుందా, అని కలెక్టర్ ఆరా తీశారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మాధురి, ఎంపీడీఓ రఘునాథ్, రూరల్ తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కల్లూరు: కల్లూరు అర్బన్ 37వ వార్డులో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ రవీంద్రబాబు హాజరయ్యారు.

➡ కల్లూరు అర్బన్ 31వ వార్డులో బీసీ యాదవ సాధికారిక సమితి రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

➡ కల్లూరు గ్రామీణ ప్రాంతాల్లో 95 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి తెలిపారు. పర్ల గ్రామంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి శ్రామికులే పట్టుగొమ్మలు

- ఘనంగా మే డే వేడుకలు
- ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించిన వివిధ పార్టీలు



సీపీఐ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న గిడ్డయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్

కర్నూలు కల్చరల్: దేశాభివృద్ధిలో శ్రామికులే పట్టుగొమ్మలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీల జెండాలు, కార్మిక సంఘాల జెండాలను నాయకులు ఆవిష్కరించి కార్మిక చట్టాల గురించి వివరించారు. సీపీఐ కార్యాలయంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఉత్సవాలు జరిగాయి. జిల్లా పార్టీ కార్యదర్శి బి.గిడ్డయ్య పార్టీ జెండాను విష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఆరోపించారు. కేంద్రానికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి మోకరిల్లుతోందని, పాలకుల విధానాలను కార్మిక వర్గం ఎప్పటికప్పుడు ఎండగట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు, నగర పార్టీ కార్యవర్గ సభ్యులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

– ఐఎఫ్‌టీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో నంద్యాల చెక్‌పోస్ట్, సీక్యాంప్, శకుంతల కల్యాణ మండపం సెంటర్‌లలో మేడే వేడుకలు జరిగాయి. నగర కార్యదర్శి సురేష్ నాయక్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్ తదితరులు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

పెద్దాసుపత్రిలో మేడే వేడుకలు


మేడే వేడుకల్లో పాల్గొన్న హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం జెండాను ఎగురవేసి వైద్య ఉద్యోగులకు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ.. ఎంతో మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలస్వామి నాయక్ మాట్లాడారు. సెక్రటరీ ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, సార్జంట్ ఉరుకుందయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు, కర్షకులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. గురువారం మే డే పురస్కరించుకొని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యాలయం వద్ద అరుణ వర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. మేడే పురస్కరించుకొని ర్యాలీలు నిర్వహించారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అధ్యక్షతన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిర్మల, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల కోసం చూడకుండా..!


పైపులైన్ పనులు చేసుకుంటున్న కాలనీ వాసులు

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు ఎస్సీ కాలనీలో గురువారం ఉదయం హంద్రీ నది నుంచి నీరు సప్లై చేసే పైపు లైన్ జాయింట్ తెగిపోయింది. కాలనీ వాసులు నీటి కోసం మధ్యాహ్నం వరకు ఇబ్బందులు పడ్డారు. అధికారుల కోసం వేసి చూడకుండా ఎస్సీ కాలనీకి చెందిన కొందరు తెగిన పైపులైన్‌ను సరి చేసుకున్నారు. ఇనుప పైప్‌లైన్ కావడంతో అధికారులు స్పందించి వెల్డింగ్ వేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

పత్తికొండ రూరల్: మండలంలోని బుగ్గతండా, ఒంటిగుడిసె తండాల్లోని నాటుసారా స్థావరాలపై గురువారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. 850 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ విశ్వేశ్వరరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది రాజేష్, తేజ పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులను పూర్తి చేయండి


జాతీయ రహదారి పనులపై ప్రశ్నిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(అర్బన్): జాతీయ రహదారి 340సీ కి సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎన్‌హెచ్ పీడీని ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెంకాయపల్లె ఎల్లమ్మ దేవాలయం, మిలటరీ కాలనీ, గార్గేయపురం చెరువు వద్ద పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఈ పనులకు భూసేకరణ పూర్తి చేసి భూమిని స్వాధీనం చేసి నెల రోజులైనా ఇంకా పనులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రశ్నించారు. వెంటనే కాంట్రాక్టర్లను పిలిపించి వారితో మాట్లాడి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఎన్‌హెచ్ 340 ఆపరేషనల్ మెయింటెనెన్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్న సీసీ కెమెరాల నిర్వహణను పరిశీలించారు. జాతీయ రహదారుల్లో వాహనాల కదలికలు, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో సీసీ కెమెరాల పనితీరు తదితర విషయాలనుఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ 340సీ పీడీ పద్మజ, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ ఈఈ శంకర్‌రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ రమేష్‌బాబు, నేషనల్ హైవేస్ డిప్యూటీ కలెక్టర్ సునీతాబాయి తదితరులు ఉన్నారు.

డిగ్రీ కాలేజీలో ఉర్దూ వర్సిటీని ఏర్పాటు చేయొద్దు


నిరసన తెలుపుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ ఆవరణలో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు భజరంగ్‌దళ్ నాయకులు స్పష్టం చేశారు. గురువారం ఆ కాలేజీ ఆవరణలో భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ దళ్ జిల్లా కన్వీనర్ సాయిరాం మాట్లాడుతూ.. పురుషుల డిగ్రీ కాలేజీలో ఇప్పటికే గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, రూసా నిధులతో కొత్తగా నిర్మించిన భవనం తగిన వసతులతో అందుబాటులోకి రాలేదన్నారు. ఇలాంటి సమయంలో ఉర్దూ యూనివర్సిటీకి తాత్కలికం పేరుతో కాలేజీ భవనాలను కట్టబెటేందుకు ఉన్నత విద్యాశాఖ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. ఉస్మానియా కాలేజీ ఆవరణలో గతంలో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయడంతో ఆ కాలేజీలో పీజీ కోర్సులు మూతపడ్డాయన్నారు. ఇక్కడ కూడా అదే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భజరంగ్ దళ్ నాయకులు శివసాయి నాథ్, గుజరాత్ సురేష్, తేజ, జయప్రకాష్ సింగ్, ఉపేంద్ర నాయక్, నవీన్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం


పూలే విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీసీ నేతలు

కర్నూలు(అర్బన్): కులగణన ద్వారా సామాజిక న్యాయాన్ని సాధించేందుకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం చేసిన పోరాటాలు ఎట్టకేలకు ఫలించాయని సంఘం జిల్లా అధ్యక్షుడు దళపతి ధర్మ అన్నారు. కులగణన చేపట్టేందుకు కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ సంఘం నేతలు గురువారం సాయంత్రం బిర్లాగేట్ సర్కిల్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధర్మ మాట్లాడుతూ.. 1931 నుంచి దేశంలో కులగణన జరగలేదని, బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంవత్సరాలుగా కులగణన జరగాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్‌రావు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశాభివృద్ధికి పట్టుకొమ్మలుగా, ఉత్పత్తి కులాలుగా, శ్రామిక వర్గంగా ఉన్న బీసీల సాధికారత కులగణన చేయడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. గత నెల 27వ తేదీన ఇదే అంశంపై విజయవాడలో మహా ర్యాలీ నిర్వహించగా, పోలీసులు భగ్నం చేసి అరెస్టులు చేశారన్నారు. ఇప్పటికైనా కులగణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామమన్నారు. కులగణనను నిష్పాక్షికంగా చేపట్టాలని కోరారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రూరల్):కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో సొంతిల్లు లేని నిరుపేదలు ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ కిదారి సందీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. అర్హులైన వారు ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రూరల్ పరిధిలో 3 సెంట్లు, అర్బన్ పరిధిలో 2 సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


సచివాలయం వద్ద పట్టపగలే వెలుగుతున్న లైటు



ఆరోగ్య కేంద్రం వద్ద వెలుగుతున్న లైటు

పగలే వెన్నెల

కర్నూలు(రూరల్): భవిష్యత్ తరాల కోసం విద్యుత్‌ను పొదుపు చేయాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అధికారుల తీరు అందుకు విరుద్ధంగా ఉంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బి.తాండ్రపాడు-1 సచివాలయం, విలేజ్ క్లినిక్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న లైటు, బీసీ కాలనీలో కొద్దిరోజులుగా వీధి లైట్లు పట్టపగలు కూడా వెలుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండే వేసవిలో పట్టపగలు సైతం వీధి దీపాలు వెలుగుతుండటంతో విద్యుత్‌తో పాటు ప్రజాధనం వృథా అవుతోందని పులువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కార్మికులకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 29వ వార్డు ముజఫర్‌నగర్‌లోని ఏపీ ఎస్‌బీసీఎల్ లిక్కర్ గోడౌన్ వద్ద వైఎస్సార్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక దినోత్సవంలో ఆయన పాల్గొని జెండా ఆవిష్కరించారు. లక్ష్మీపురం పరిధిలోని భారత్ గ్యాస్ డ్రైవర్స్, హమాలీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే కార్యక్రమంలోనూ కాటసాని పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్మికులను అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో 28, 29వ వార్డు కార్పొరేటర్లు నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

☛ కల్లూరు ఎస్టేట్, ఏపీ సీడ్స్, రైస్ మిల్, సిల్వర్ ఫ్యాక్టరీ, ఒంటెద్దు బండ్ల యూనియన్, హమాలి, రిక్షా యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ, సీపీఎం నాయకులు సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, కృష్ణ, మధు, రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.


వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

కార్మికులను మోసగించిన కూటమి ప్రభుత్వం

కర్నూలు (టౌన్): కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీమేశ్వర్ రెడ్డి విమర్శించారు. గురువారం మే డే పురస్కరించుకొని స్థానిక సి.క్యాంపు సెంటర్‌లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి కార్మికులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు హక్కులు, సంక్షేమాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయడంలో ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూ కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల పక్షాన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నిరంతరం పాటుపడుతుందని చెప్పారు. యూనియన్ నగర అధ్యక్షుడు ప్రకాష్, కటారి సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో నిబంధనలు పాటించాలి


సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కారుణ్య నియామకాల కింద ఏ విభాగం వారు అదే విభాగంలో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలస్వామి నాయక్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం కింద అక్కడే ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్కడ ఖాళీ పోస్టులు లేకపోతే జిల్లా కలెక్టర్ దరఖాస్తును పరిశీలించి ఖాళీ ఉన్న విభాగంలో నియమిస్తారన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా నేరుగా నియామకాలు చేపడుతున్నారని, తద్వారా విద్యార్హత ఉన్నా ఎంతోమంది పదోన్నతి పొందకుండా అన్యాయానికి గురవుతున్నారని వివరించారు. దీన్ని వెంటనే సరిచేయాలని కోరారు. యూనియన్ సెక్రటరీ ఎస్.ఖాజామొహిద్దీన్, ట్రెజరర్ సురేష్ ఉన్నారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు


తుగ్గలి సమీపంలో బోల్తా పడిన ఆటో

తుగ్గలి: ఆటో బోల్తా పడి పలువురు గాయపడిన ఘటన గురువారం తుగ్గలి వద్ద చోటు చేసుకుంది. ఎంకె కొట్టాలకు చెందిన కాశీం, ఆర్.కొట్టాలకు చెందిన ఆటో డ్రైవర్‌తో కలిసి కల్లూరు నుంచి పల్లీలు వేసుకొని పత్తికొండ వైపు వెళ్తున్న ఆటో తుగ్గలి ఏఎస్ కాలేజీ సమీపంలో అదే మార్గంలో వెళ్తూ ఓవర్ టేక్ చేయబోయిన బైక్ ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న హిందూపురానికి చెందిన ఆరుగురు ప్రయాణికులతో పాటు ఎంకె కొట్టాల కాశీం, ఆర్.కొట్టాల డ్రైవర్, బైక్‌పై వెళ్తున్న మదనంతపురం మహేష్, లక్ష్మీనారాయణ గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై విచారణ చేపట్టారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి


కొత్తపేటలో మురుగు కాల్వ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, అవి లోపిస్తే సంబంధిత అధికారులదే బాధ్యత అని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు స్పష్టం చేశారు. స్థానిక కొత్తపేటలో నిర్మించిన మురుగు కాల్వలను ఆయన గురువారం పరిశీలించారు. అంతకుముందు పాత కంట్రోల్ రూమ్, పెద్ద పడఖానా, అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో రూ.44.47 కోట్లతో 330 అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అందులో కొన్ని పూర్తి చేశామని, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఎంఈ సత్యనారాయణ, డీఈఈ గంగాధర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన Union Bank of India, V.R.Colony Branch, Kurnool, వారి సూచనల మేరకు ఇవ్వు ప్రకటన ఏమనగా, నా క్లయింటు అయిన బ్యాంకు వారు శ్రీమతి పుట్టపాసం కిరణ్మయి భర్త గోపా బజయ్య ఇంటి నెం:45/24బి-44-10బి, 4వ లైన్, వెంకటరమణ కాలనీ, కర్నూలు సిటీ & జిల్లా, అను వారికి బ్యాంకింగ్ గైడ్‌లైన్స్ ప్రకారం అన్ని రకాల వెరిఫికేషన్ (విచారణ) అనంతరం దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి కొనుగోలు నిమిత్తం ఋణము (Loan) తేదిన మంజూరు చేసియున్నారు. అయితే సదరు స్థిరాస్తి విక్రయదారులలో ఒకరు అయిన హెచ్.బి.వెంకటేశ్వరరెడ్డి తండ్రి హెచ్.బి. ఉమాకాంతరెడ్డి, క్వార్టర్ నెం:2, పోలీస్ క్వార్టర్స్, కోడుమూరు మండలం, కర్నూలు. అనువారు కొన్న వారిపేరు మీద రిజిస్టరు చేయుటకు ముందు అనగా 24.04.2025 తేదిన కర్నూలులోని బిర్లా కాంపౌండ్ నందు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్తుండగా మార్గమధ్యలో సదరు స్థిరాస్తి యొక్క లింకు దస్తావేజు (విక్రయ దస్తావేజు) నెం: 8279/2016 పోగొట్టుకొనియున్నారు. కావున సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన లేదా ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్న అట్టి వాటిని 7 దినములలోగా దిగువ తెలిపిన అడ్రస్సులో గాని, నా క్లయింటు అయిన బ్యాంకు వారి అడ్రస్సులోగాని, బారోవర్ (Barrower) అడ్రస్సులో గాని తెలియపర్చగలరు. అట్లుగాక సదరు స్థిరాస్తిపై ఎవరికీ ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించి సదరు లోనును నా క్లయింట్ వారు ప్రాసెస్ చేసుకొనగలరు.

షెడ్యూలు: కర్నూలు డి. కర్నూలు సబ్‌డి. కర్నూలు సిటీ, మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన 45వ వార్డు, అమీనా అబ్బాస్ నగర్ నందు గల కల్లూరు గ్రామ సర్వే నెంబరు:391 పైకి గల భూమిలో ఇండ్ల ప్లాట్లు నిర్ణయించి హైదరాబాద్‌లో టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ గారిచే L.P.No: 246/82 నెంబరుగా అప్రూవల్ కాబడిన గారిచే ప్లాట్ల పైకి నెం: 19, 20 నెంబర్లు గల ప్లాట్ల స్థలములో నిర్మించిన "స్వర్ణ రెసిడెన్సి" అపార్ట్‌మెంట్ నందలి 2వ అంతస్తులోని ఫ్లాట్ నెం: 201వ నెంబరు గల ఫ్లాట్ తాలుకు పూర్తి అపార్ట్‌మెంటుకు చెక్కుబంది. **తూర్పు:** ఫ్లాట్ నెం: 21, **పడమర:** ఫ్లాట్ నెం: 18, **ఉత్తరం:** రోడ్, **దక్షిణం:** ఫ్లాట్ నెం: 24 & 23. 2వ అంతస్తులోని 201వ నెంబరు గల ఫ్లాట్‌కు చెక్కుబంది. **తూర్పు:** కారిడార్, స్టైర్ కేస్, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఫ్లాట్ నెం: 202, **దక్షిణం:** ఓపెన్ టు స్కై.

G.S.Vijaya Bhaskar Reddy,
B.A.,B.L., Advocate
Address : H.No.87-1077, Ganesh Nagar, Nandyal Road, Near Partha Sarathi Towers, Kurnool. Cell: 9347928866, 9985474567

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కర్నూలు
70750 09182
Office mail : sakshiknladvt@gmail.com